## పాలసీదార్లకు అర్థమయ్యేలా వివరాలివ్వాలి

### ఇన్సూరెన్స్ సంస్థలకు ఐఆర్‌డీఏ నిర్దేశం

న్యూఢిల్లీ, అక్టోబర్ 30: బీమా పాలసీ తీసుకున్నవారికి ఆ పాలసీ ప్రాథమిక వివరాలు, షరతులు సులభంగా అర్థమయ్యే రీతిలో నిర్దేశిత ఫార్మాట్‌లో వచ్చే జనవరి 1 నుంచి ఇన్సూరెన్స్ కంపెనీలు ఇవ్వాల్సి ఉంటుంది. ఎంత మొత్తానికి పాలసీ తీసుకున్నారు? పాలసీ కవర్ చేసేవి ఏమిటి? చేయనివి ఏమిటి? క్లెయిం ఎలా పొందాలి?..ఇటువంటి సమాచారాన్నంతటినీ పాలసీదార్లకు అందించేందుకు ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఐఆర్‌డీఏ) ప్రస్తుత కస్టమర్ ఇన్ఫర్మేషన్ షీట్ (సీఐఎస్)ను సులభంగా అర్థమయ్యే రీతిలో సవరించింది. ఈ సవరించిన సీఐఎస్‌లోనే 2024 జనవరి 1 నుంచి వివరాల్ని పొందుపర్చాలంటూ ఇన్సూరెన్స్ కంపెనీలను ఆదేశిస్తూ ఐఆర్‌డీఏ ఒక సర్క్యులర్ జారీచేసింది. పాలసీదారు తాను తీసుకున్న పాలసీ నియమ నిబంధనలు, షరతుల్ని అర్థం చేసుకోవడం ముఖ్యమని ఐఆర్‌డీఏ తెలిపింది. పాలసీ డాక్యుమెంట్ సాంకేతికమైన లీగల్ పరిభాషలో ఉంటున్నందున, పాలసీ వివరాల్ని సరళమైన పదాల్లో తెలియపర్చాల్సిన అవసరం ఉందని సర్క్యులర్‌లో వివరించింది. ఇన్సూరెన్స్ కంపెనీ, పాలసీ హోల్డరు మధ్య సమాచార లోపం కారణంగా పలు ఫిర్యాదులు వస్తున్నాయని, ఈ నేపథ్యంలోనే సవరించిన సీఐఎస్‌ను ప్రవేశపెడుతున్నట్టు తెలిపింది.

**సీఐఎస్‌లో అంశాలివి..**

కొత్త సీఐఎస్ ప్రకారం ఇన్సూరెన్స్ కంపెనీలు 'పాలసీ పేరు, నంబరు, ఏ విధమైన పాలసీ, బీమా చేసిన మొత్తం, పాలసీ కవరేజి (హాస్పిటల్ వ్యయాలు తదితరాలు), మినహాయింపులు (పాలసీ కింద కవర్‌కానివి), కవరేజ్ ఆర్థిక పరిమితులు, క్లెయిం చేసుకునే విధానం, వివాదాలు/ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం వివరాలు తదితరాల్ని తెలియపరుస్తాయి. పాలసీదార్లు అందరికీ కొత్త సీఐఎస్‌ను ఇన్సూరెన్స్ సంస్థలు, ఏజెంట్లు,ఇంటర్మీడియరీలు ఇవ్వాలని, వారికి అందినట్టు ధృవీకరణ తీసుకోవాలని ఐఆర్‌డీఏ సర్క్యులర్‌లో ఆదేశించింది. ప్రాంతీయ భాషలో కూడా సీఐఎస్‌ను అందించాలన్నది.

## స్కైరూట్ 225 కోట్ల సేకరణ

హైదరాబాద్, అక్టోబర్ 30: హైదరాబాద్ కేంద్రస్థానంగా కార్యకలాపాలు అందిస్తున్న స్కైరూట్ ఏరోస్పేస్ మరో 27.5 మిలియన్ డాలర్లు(రూ.225 కోట్ల) నిధులు సమీకరించింది. ప్రీ-సీరిస్ సీ ఫండింగ్‌లో భాగంగా సింగపూర్‌కు చెందిన గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ టెమాసెక్ నుంచి ఈ నిధులను సేకరించింది. ఈ నిధులను భవిష్యత్తు వ్యాపార నిమిత్తం వినియోగించనున్నట్టు, ముఖ్యంగా మౌలిక సదుపాయాలు, టెక్నాలజీని ఆధునీకరించడానికి, ప్రతిభ కలిగిన సిబ్బందిని నియమించుకోవడానికి, ప్రయోగ ఫ్రీక్వెన్సీ, సామర్థ్యాన్ని పెంచుకోవడానికి వినియోగించనున్నట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. 2022లో సంస్థ 95 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించిన విషయం తెలిసిందే.

అలాగే నవంబర్ 2022లో తన తొలి రాకెట్‌ను అంతరిక్షంలోకి ప్రవేశపెట్టిన సంస్థ..తన రెండో రాకెట్‌ను అంతరిక్షంలోకి పంపించడానికి సిద్ధమవుతున్నది. ఈ సందర్భంగా కంపెనీ కో-ఫౌండర్, సీవోవో భరత్ మాట్లాడుతూ..అంతర్జాతీయ పెట్టుబడిదారైన టెమాసెక్ తమ సంస్థలో ఇన్వెస్ట్ చేయడం చాలా సంతోషంగా ఉన్నదని, ఈ నిధులను భవిష్యత్తు వ్యాపార విస్తరణకు, ఆర్‌అండ్‌డీ, సిబ్బంది సంఖ్యను పెంచుకోవడానికి వినియోగించనున్నట్టు చెప్పారు.

# 52వేల ఉద్యోగాలు ఔట్

**దేశీయ ఐటీ కంపెనీల్లో రికార్డు స్థాయి కోతలు**

**గత 6 నెలల్లో అర లక్షకుపైగా తగ్గిన కొలువుల సంఖ్య**

**25 ఏండ్లలో ఈ స్థాయిలో తగ్గడం ఇదే తొలిసారి**

**మున్ముందు మరింతగా పడిపోవచ్చన్న అంచనాలు**

**క్యాంపస్ రిక్రూట్‌మెంట్లకు బ్రేక్ ఇస్తున్న సంస్థలు**

**సంక్షోభంలో భారతీయ ఐటీ రంగం**



**భారతీయ ఐటీ రంగంలో సంక్షోభపు ఛాయలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.**

**అంతర్జాతీయ మార్కెట్‌లో నెలకొన్న విపత్కర పరిస్థితులు, గ్లోబల్ ఎకానమీలో ఏర్పడ్డ అనిశ్చిత వాతావరణం దేశీయ ఐటీ సంస్థల ఆదాయానికి గండి కొడుతున్నాయి.**

**వ్యయ నియంత్రణ చర్యల దిశగా ఇప్పుడు సంస్థలు అడుగులు వేస్తున్నాయి. అందుకే గత 6 నెలల్లో 52వేల ఉద్యోగాలు పోయాయి. గడిచిన 25 ఏండ్లలో ఇదే గరిష్ఠ స్థాయి. సమీప భవిష్యత్తులోనూ ఉద్యోగుల తొలగింపు లుంటాయన్న సంకేతాలు ఇప్పుడు ఆందోళన కలిగిస్తున్నది.**

ముంబై/బెంగళూరు, అక్టోబర్ 30: దేశీయ ఐటీ కంపెనీల్లో పెద్ద ఎత్తున ఉద్యోగాలు పోతున్నాయి. భారతీయ టాప్-10 ఐటీ సంస్థల్లో తొమ్మిదింటిలో ఈ ఏడాది ఏప్రిల్ మొదలు సెప్టెంబర్ ఆఖరుదాకా ఏకంగా అర లక్షకుపైగా ఉద్యోగులు బయటకుపోయారు. ఆయా సంస్థలు వెల్లడించిన గణాంకాల ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) ప్రథమార్ధం (ఏప్రిల్-సెప్టెంబర్)లో 51,744 కొలువులు పోయాయి. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా, కాగ్నిజెంట్, ఎంఫసిస్, పర్సిస్టెంట్ సిస్టమ్స్, ఎల్‌టీఐమైండ్‌ట్రీల్లో ఈ ఏడాది మార్చి 31న 21.1 లక్షలకుపైగా ఉన్న ఉద్యోగుల సంఖ్య.. ఈ సెప్టెంబర్ 30కి 20.6 లక్షలకు క్షీణించింది. గడిచిన 25 ఏండ్లలో ఇదే గరిష్ఠమని డాటా అగ్రిగేటర్ వేదిక స్టాటిస్టా తాజాగా తెలియజేసింది.

**గ్లోబల్ మార్కెట్ దెబ్బ**

భారతీయ ఐటీ రంగానికి అంతర్జాతీయ వ్యాపారమే కీలకం. ఈ క్రమంలో అమెరికా, ఐరోపా తదితర గ్లోబల్ మార్కెట్లలో చోటు చేసుకున్న ప్రతికూల పరిస్థితులు, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ మందగమనం.. దేశీయ ఐటీ కంపెనీలను భారీగానే ప్రభావితం చేస్తున్నాయి. భారతీయ ఐటీ రంగానికి ఇదో పరీక్షా కాలం అని మెజారిటీ నిపుణులు ఇప్పుడు అభిప్రాయపడుతున్నారంటే పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. కాగా, దేశంలోని టాప్-10 ఐటీ కంపెనీల్లో ఎల్‌అండ్‌టీ టెక్నాలజీ సర్వీసెస్ మినహా మిగతావన్నీ ఉద్యోగుల్ని తగ్గించేశాయి. ఎల్‌అండ్‌టీ టెక్నాలజీ సర్వీసెస్ సైతం 32 మందినే ఈ జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో ఉద్యోగాల్లోకి తీసుకున్నది. అయితే సంస్థ ఉద్యోగుల సంఖ్య ఎప్పుడూ లేనివిధంగా 22,265కి చేరింది.

**ఫ్రెషర్స్‌కు గడ్డుకాలం**

ఐటీ రంగంలో స్థిరపడాలనుకునేవారికి గడ్డుకాలమే నడుస్తున్నదని విశ్లేషకులు చెప్తున్నారు. గ్లోబల్ కస్టమర్లు, ముఖ్యంగా పశ్చిమ దేశాల నుంచి ఆర్డర్లు గణనీయంగా తగ్గిపోవడం.. భారతీయ ఐటీ సంస్థల ఆదాయాన్ని దిగజార్చుతున్నదని పేర్కొంటున్నారు. నిజానికి గత ఆర్థిక సంవత్సరం (2022-23) వరకు పరిస్థితులు బాగానే ఉన్నా.. ఈ ఏడాది నుంచే ప్రతికూలంగా మారాయని అభిప్రాయపడుతున్నారు. దీంతో ఇప్పుడప్పుడే క్యాంపస్ రిక్రూట్‌మెంట్లనూ ఆశించలేమని వ్యాఖ్యానిస్తున్నారు. ఆయా దిగ్గజ ఐటీ కంపెనీలూ ఇదే సంకేతాల్ని ఇస్తుండటం గమనార్హం. మొత్తానికి దేశీయ ఐటీ రంగంలో ఈ రకమైన వాతావరణం ఎక్కువకాలం కొనసాగితే నిరుద్యోగం రేటు పెరగక తప్పదన్న హెచ్చరికలూ నిపుణుల నుంచి వస్తున్నాయి.

- **2021-22 నుంచి 2022-23 ఆర్థిక సంవత్సరాల మధ్య దేశంలోని టాప్ ఐటీ కంపెనీల్లో ఉద్యోగుల సంఖ్య మునుపెన్నడూ లేనివిధంగా గరిష్ఠ స్థాయిని తాకింది.**
- **గత ఏడాది జూలై-సెప్టెంబర్‌లో రికార్డు స్థాయికి టీసీఎస్ (6,16, 171), విప్రో (2,62,626), టెక్ మహీంద్రా (1,63,912), ఎల్‌టీఐమైండ్‌ట్రీ (86,936) ఉద్యోగులు.**
- **నిరుడు అక్టోబర్-డిసెంబర్‌లో తారాస్థాయికి కాగ్నిజెంట్ (3,55,300), ఇన్ఫోసిస్ (3,46,845) ఉద్యోగులు.**
- **ఈ ఏడాది జనవరి-మార్చి వ్యవధిలో రికార్డు స్థాయికి చేరిన హెచ్‌సీఎల్ టెక్ (2,25,944), పర్సిస్టెంట్ సిస్టమ్స్ (22,889) ఉద్యోగులు.**
- **క్రిందటి ఏడాది ఏప్రిల్-జూన్‌లో మునుపెన్నడూ లేనివిధంగా గరిష్ఠంగా నమోదైన ఎంఫసిస్ (36,899) ఉద్యోగులు.**

**ఈ సెప్టెంబర్ 30 నాటికి ఏ సంస్థలో ఎంతమంది?**

| సంస్థ | ఉద్యోగులు |
|---|---|
| టీసీఎస్ | 6,06,985 |
| కాగ్నిజెంట్ | 3,45,600 |
| ఇన్ఫోసిస్ | 3,28,764 |
| విప్రో | 2,44,707 |
| హెచ్‌సీఎల్ టెక్ | 2,21,139 |
| టెక్ మహీంద్రా | 1,50,604 |
| ఎల్‌టీఐమైండ్‌ట్రీ | 85,532 |
| ఎంఫసిస్ | 33,771 |
| పర్సిస్టెంట్ సిస్టమ్స్ | 22,842 |
| ఎల్‌అండ్‌టీ టెక్నాలజీ | 22,265 |

దేశీయ ఐటీ రంగంలో డిమాండ్ బలహీనంగా ఉన్నది. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ వృద్ధిలో స్థిరత్వం ఏర్పడేదాకా భారతీయ ఐటీ సెగ్మెంట్‌లో ఒడిదుడుకులు తప్పవు. భవిష్యత్తు ఇబ్బందికరంగా ఉంటుందన్న అంచనాల మధ్య చాలా దేశాల్లోని ఐటీ కస్టమర్లు పొదుపు దిశగా అడుగులు వేస్తున్నారు. వ్యయ నియంత్రణ చర్యలు పాటించి తమ వద్ద ఉండే నగదు నిల్వల్ని కాపాడుకునే ప్రయత్నాన్ని ఆయా కంపెనీలు చేస్తున్నాయి. ఈ విపత్కర పరిస్థితికి రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, గాజాపై ఇజ్రాయెల్ దాడులూ ఓ కారణమే.

**-కే కృతీవాసన్, టీసీఎస్ సీఈవో**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24)లో క్యాంపస్ రిక్రూట్‌మెంట్లు లేనట్టే. పరిస్థితులు ఎంతమాత్రం అనుకూలంగా లేవు. అయినప్పటికీ ప్రతీ త్రైమాసికంలో అవకాశాల్ని అంచనా వేస్తూ ముందుకెళ్తాం. భారతీయ ఐటీ రంగ సంస్థలకు విదేశాల నుంచి వచ్చే ఆర్డర్లే ప్రధాన ఆదాయ వనరు. కానీ ఇప్పుడీ ఆర్డర్లు చాలావరకు తగ్గిపోయాయి. ఆయా దేశాల్లో, అంతర్జాతీయ మార్కెట్‌లో నెలకొన్న ఇబ్బందికర వాతావరణమే ఇందుకు కారణం. దీంతో దేశీయ ఐటీ కంపెనీల వ్యాపారం పడిపోయింది. దాని ఫలితమే ఉద్యోగుల సంఖ్యలో ఈ తగ్గింపులు. ఫ్రెషర్స్‌కు నిజంగా ఈ పరిణామాలు మింగుడుపడనివే.

**-నిరంజన్ రాయ్, ఇన్ఫోసిస్ సీఎఫ్‌వో**

కొత్త నియామకాలకు వెళ్లే ముందు ఇప్పటికే ఆఫర్ ఇచ్చిన ఉద్యోగులను పనిలోకి తీసుకోవాలని చూస్తున్నాం. అప్పటిదాకా ఎటువంటి న్యూ రిక్రూట్‌మెంట్స్ ఉండబోవు. మార్కెట్‌లో ప్రతికూల పరిస్థితులున్నాయి. అయినప్పటికీ గతంలో తమ సంస్థ ద్వారా ఉద్యోగావకాశాల్ని అందిపుచ్చుకున్నవారిని దూరం చేసుకోబోము. వెయిటింగ్ లిస్టులో ఉన్నవారికి రాబోయే త్రైమాసికాల్లో ప్లేస్‌మెంట్ ఇచ్చేందుకు అన్నివిధాలా ప్రయత్నిస్తున్నాం.

**-సౌరభ్ గోయిల్, విప్రో సీహెచ్‌ఆర్‌వో**

## యాపిల్ ఆదాయం 49 వేల కోట్లు

న్యూఢిల్లీ, అక్టోబర్ 30: ఐఫోన్ల తయారీ సంస్థ యాపిల్ ఇండియా అంచనాలకుమించి రాణించింది. మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో సంస్థ రూ.49,322 కోట్ల ఆదాయాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే వచ్చిన రూ.33,381 కోట్ల ఆదాయంతో పోలిస్తే 48 శాతం వృద్ధి నమోదైందని పేర్కొంది. దేశవ్యాప్తంగా ఐఫోన్ల అమ్మకాలు భారీగా పుంజుకోవడం వల్లనే ఇది సాధ్యమైందని పేర్కొంది. అలాగే కంపెనీ ఆదాయం రూ.1,263 కోట్ల నుంచి రూ.2,230 కోట్లకు ఎగబాకింది. ఖర్చులు రూ. 46,444 కోట్లుగా నమోదయ్యాయి.

## 8.40 శాతం వడ్డీకే ఎల్ఐసీ హెచ్‌ఎఫ్‌ఎల్ గృహ రుణం

ముంబై, అక్టోబర్ 30: ఎల్ఐసీ హౌజింగ్ ఫైనాన్స్ లిమిటెడ్..ప్రస్తుత పండుగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక గృహ రుణ వడ్డీరేటును ప్రకటించింది. రూ.2 కోట్ల లోపు, 750 కంటే అధిక సిబిల్ స్కోర్ కలిగిన వారికి 8.40 శాతం వడ్డీకే గృహ రుణాన్ని అందిస్తున్నది. డిసెంబర్ 31 లోపు గృహ తొలి సారి గృహ రుణం తీసుకున్నవారికి మాత్రమే ఈ వడ్డీ వర్తించనున్నది. ఈ సందర్భంగా కంపెనీ ఎండీ, సీఈవో త్రిభువన్ అధికారి మాట్లాడుతూ.. పండుగ సీజన్‌లో అత్యధిక మంది గృహాలు కొనుగోలు చేస్తారని, వీరికి ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రత్యేక ఆఫర్‌ను అందిస్తున్నట్టు చెప్పారు.

## రెయిన్‌బో ఆశాజనకం

హైదరాబాద్, అక్టోబర్ 30: ప్రముఖ చిన్న పిల్లల దవాఖానల నిర్వహణ సంస్థ రెయిన్‌బో చిల్డ్రన్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. సెప్టెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను రూ. 332.68 కోట్ల ఆదాయంపై రూ.63.16 కోట్లు పన్ను చెల్లించిన తర్వాత నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన ఆదాయం కంటే 6.3 శాతం వృద్ధిని కనబరుచగా, లాభంలో 2.7 శాతం పెరుగుదల కనిపించిందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

# బ్లాక్‌స్టోన్ చేతికి కేర్ హాస్పిటల్స్

**రూ.5,827 కోట్లకు ఈవ్‌కేర్ నుంచి కొనుగోలు**

న్యూఢిల్లీ, అక్టోబర్ 30: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న కేర్ హాస్పిటల్స్‌లో మెజారిటీ వాటాను యూఎస్ ఇన్వెస్ట్‌మెంట్స్ దిగ్గజం బ్లాక్‌స్టోన్ సొంతం చేసుకుని, దేశంలో హెల్త్‌కేర్ సర్వీసుల రంగంలోకి ప్రవేశిస్తున్నది. కేర్ హాస్పిటల్స్‌లో 72.5 శాతం వాటాను మరో అమెరికా ఫండ్ టీపీజీ రైజ్‌కు చెందిన ప్లాట్‌ఫామ్ ఈవ్‌కేర్ నుంచి 700 మిలియన్ డాలర్లకు (దాదాపు రూ. 5,827 కోట్లు) కొనుగోలు చేయడానికి ఒక ఒప్పందంపై సంతకాలు చేసినట్టు బ్లాక్‌స్టోన్ సోమవారం ప్రకటించింది. బ్లాక్‌స్టోన్ నిర్వహించే ప్రైవేట్ ఈక్విటీ ఫండ్స్ ద్వారా జరిగే ఈ లావాదేవీ ద్వారా కేర్ హాస్పిటల్స్ విలువ రూ.6,600 కోట్లుగా లెక్కించారు. మరో ప్రత్యేక లావాదేవీ ద్వారా కేరళకు చెందిన కిమ్స్ హెల్త్ (కేరళ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్)లో 80 శాతం వాటాను కేర్ హాస్పిటల్స్, టీపీజీలు కలిసి 400 మిలియన్ డాలర్లకు కొంటున్నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇందులో 300 మిలియన్ డాలర్లు బ్లాక్‌స్టోన్, 100 మిలియన్ డాలర్లు టీపీజీలు పెట్టుబడి చేస్తాయి. అంటే పరోక్షంగా కేర్ హాస్పిటల్స్ ద్వారా కిమ్స్‌హెల్త్‌లో కూడా బ్లాక్‌స్టోన్ మెజారిటీ వాటాను తీసుకుంటున్నట్లవుతుంది.

**బిలియన్ డాలర్లు.. రెండు హాస్పిటల్స్**

కేర్ హాస్పిటల్స్‌లో వాటాకు 700 మిలియన్ డాలర్లు, కిమ్స్‌హెల్త్‌లో వాటాకు 300 మిలియన్ డాలర్లు కలిసి ఈ రెండు హాస్పిటల్స్‌లో బ్లాక్‌స్టోన్ ఒక్కసారిగా 1 బిలియన్ డాలర్లు పెట్టుబడి చేస్తున్నది. కేర్‌హాస్పిటల్స్ నెట్‌వర్క్‌కు కిమ్స్‌హెల్త్ తోడై భారత్‌లోని 11 నగరాల్లో 23 హెల్త్‌కేర్ సదుపాయాలు, 4,000కుపైగా బెడ్స్ కలిగిన అతిపెద్ద హాస్పిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో ఒకటిగా ఆవిర్భవిస్తుందని బ్లాక్‌స్టోన్ వివరించింది. ఈ సంయుక్త ప్లాట్‌ఫామ్‌లో మైనారిటీ వాటాను టీపీజీకి చెందిన ఈవ్‌కేర్ హెల్త్ ఫండ్ అట్టిపెట్టుకుంటుంది. ఇండియా హెల్త్‌కేర్ రంగంలో కేర్ హాస్పిటల్స్, కిమ్స్ హెల్త్‌లు విశ్వసనీయమైన బ్రాండ్లని, హై క్లినికల్ కేర్ క్వాలిటీపై దృష్టినిలిపే పేషెంట్ సెంట్రిక్ హాస్పిటల్ ప్లాట్‌ఫామ్‌ను నిర్మించడమే తమ లక్ష్యమని బ్లాక్‌స్టోన్ ప్రైవేట్ ఈక్విటీ మేనేజింగ్ డైరెక్టర్ గణేష్ మణి తెలిపారు. కేర్ హాస్పిటల్స్‌కు హైదరాబాద్‌తో పాటు ఔరంగాబాద్, భువనేశ్వర్, ఇండోర్, నాగపూర్, రాయిపూర్, విశాఖపట్నం నగరాల్లో సదుపాయాలు ఉన్నాయి. కిమ్స్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ కేరళలో అతిపెద్ద ప్రైవేటు హెల్త్‌కేర్ సంస్థ.

## తగ్గిన జీఎమ్మార్ ఎయిర్‌పోర్ట్స్ నష్టం

హైదరాబాద్, అక్టోబర్ 30: జీఎమ్మార్ ఎయిర్‌పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్(జీఐఎల్) నష్టాలు మరింత తగ్గాయి. గడిచిన త్రైమాసికానికిగాను నష్టం రూ.190 కోట్లకు తగ్గినట్టు బీఎస్ఈకి సమాచారం అందించింది. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో నష్టం రూ.197 కోట్లుగా ఉన్నది. అయినప్పటికీ కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 25 శాతం ఎగబాకి రూ.1,285 కోట్ల నుంచి రూ.1,607 కోట్లకు ఎగబాకింది. మొత్తం ప్రయాణికుల 25 శాతం పెరిగి 2.65 కోట్లకు చేరుకున్నట్టు తెలిపింది. వీరిలో ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ ద్వారా 1.77 కోట్ల మంది ప్రయాణించగా, హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి 60 లక్షల మంది ప్రయాణించినట్లు వెల్లడించింది.

## భెల్ సీఎండీగా కొప్ప సదాశివ మూర్తి

న్యూఢిల్లీ, అక్టోబర్ 30: ప్రభుత్వరంగ సంస్థ భెల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా కొప్ప సదాశివ మూర్తి నియామకానికి కంపెనీ బోర్డు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. మే నెలలో భెల్ సీఎండీగా మూర్తిని నియమిస్తూ భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖకు ప్రధాని అధ్యక్షతన అపాయింట్‌మెంట్ కమిటీ ఆఫ్ క్యాబినెట్(ఏసీసీ) సూచించింది. ప్రస్తుతం ఆయన కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నవంబర్ 1, 2023 నుంచి అమలులోకి రానున్న ఈ నియామకం.. 28.02.2027 వరకు కొనసాగనున్నారు.

## వ్యాపారంలో కమ్యూనికేషనే కీలకం

**నామ్ధారీ గ్రూప్ సీఎండీ సూరత్ సింగ్ మల్హోత్రా**

*పీఆర్‌సీఐ కార్యక్రమంలో నామ్ధారి గ్రూప్ సీఎండీ సూరత్ సింగ్ మల్హోత్రా తదితరులు*

హైదరాబాద్, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): వ్యాపారం, కార్పొరేట్ ప్రపంచంలోనూ కమ్యూనికేషన్ కీలకపాత్ర పోషిస్తున్నదని నామ్ధారీ గ్రూప్ సీఎండీ సూరత్ సింగ్ మల్హోత్రా తెలిపారు. సమర్థవంతమైన కమ్యూనికేషన్ ఆవశ్యకత నేడు ఎంతో ఉందన్నారు. ప్రపంచ కమ్యూనికేటర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పబ్లిక్ రిలేషన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీఆర్‌సీఐ) హైదరాబాద్ విభాగం సోమవారం థ్రిల్ సిటీలో ఓ కార్యక్రమాన్ని నిర్వహించింది. దీనికి నామ్ధారీ గ్రూప్ సీఎండీ, దక్షిణాఫ్రికాలోని లెసో తో కింగ్‌డమ్ కాన్సుల్ జనరల్ సూరజ్ సింగ్ మల్హోత్రా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రస్తుతం సమాచార వ్యవస్థకున్న ప్రాధాన్యతను ఈ సందర్భంగా ఆయన వివరించారు. అనంతరం ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ ఆర్ పృథ్వీరాజ్.. 'కంటెంట్ కనెక్ట్స్ కమ్యూనికేషన్ 3సీ' అనే సబ్జెక్టుపై ప్రసంగించారు. మీడియాతో విశ్వసనీయమైన సంబంధాలను ఏర్పర్చుకోవడానికి.. విషయ నాణ్యత, సంబంధిత అంశాలపై ప్రామాణికమైన సమాచారాన్ని అందించడానికి ప్రజా సంబంధాలు, కార్పొరేట్ కమ్యూనికేషన్ నిపుణుల అవసరం ఉందన్నారు. ఏదైనా సమాచారం, వార్తల సమాహారానికి అంతిమ లక్ష్యం ప్రజలేనన్న ఆయన.. మీడియా మధ్యవర్తిగా మాత్రమే పనిచేస్తుందని గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌సీఐ జాతీయ ఉపాధ్యక్షుడు కే రవీంద్రన్, హైదరాబాద్ విభాగం చైర్మన్ షకీల్ అహ్మద్, వైస్ చైర్‌పర్సన్ జి అనీజ, సెక్రటరీ ఫిలిప్ జాషువా, జాయింట్ సెక్రటరీ జాకబ్ రాస్ భూంపాగ్, ట్రెజరర్ నోయెల్ రాబిన్సన్‌తోపాటు సౌత్‌జోన్ హెడ్ టీవీఎస్ నారాయణ్, పబ్లిక్ రిలేషన్స్ నిపుణులు పాల్గొన్నారు.

# మళ్లీ 64 వేల పైకి సెన్సెక్స్

### వరుసగా రెండోరోజు లాభపడిన సూచీలు

ముంబై, అక్టోబర్ 30: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండోరోజు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడైనప్పటికీ దేశీయ బ్లూచిప్ సంస్థల నుంచి లభించిన మద్దతుతో సూచీలు తిరిగి కోలుకున్నాయి. ప్రారంభంలో నష్టపోయిన సూచీలు చివరి గంటలో మదుపరులు కొనుగోళ్ళకు మద్దతు తెలుపడంతో సెన్సెక్స్ తిరిగి 64 వేల పాయింట్ల పైకి చేరుకున్నది. గ్లోబల్ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టడం పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని కలిగించింది. ఇంట్రాడేలో 400 పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 329.85 పాయింట్లు ఎగబాకి 64,112.65 వద్ద ముగిసింది. అటు ఎన్ఎస్ఈ నిఫ్టీ 93.65 పాయింట్లు అందుకొని 19,140.90 వద్ద స్థిరపడింది.

- అల్ట్రాటెక్ సిమెంట్, రిలయన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎస్బీఐ, టీసీఎస్, ఎల్‌అండ్‌టీ, కొటక్ మహీంద్రా బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడాలు లాభాల్లో ముగిశాయి.
- కానీ, టాటా మోటర్స్, మారుతి, యాక్సిస్ బ్యాంక్, మహీంద్రాఅండ్ మహీంద్రా, ఐటీసీ, ఎన్‌టీపీసీ, టాటా స్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్‌లు 3 శాతం వరకు నష్టపోయాయి.
- బీఎస్ఈ మిడ్ క్యాప్, స్మాల్‌క్యాప్ ఇండెక్స్‌లు లాభాల్లో ముగిశాయి.
- రంగాలవారీగా చూస్తే రియల్టీ 1.99 శాతం, టెలికమ్యూనికేషన్ 1.52 శాతం, ఎనర్జీ 1.24 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ 1.16 శాతం, బ్యాంకింగ్ రంగ సూచీలు లాభాల్లో ముగిశాయి.
- ఎఫ్ఎంసీ, ఆటో, మెటల్ రంగ సూచీలు నష్టపోయాయి.
- వరుసగా రెండు సెషన్లలో సెన్సెక్స్ వెయ్యి పాయింట్ల వరకు లాభపడింది.
- గ్లోబల్ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 1.55 శాతం తగ్గి 89.18 వద్ద ముగిసింది.
- ఈ నెలలో ఇప్పటి వరకు దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు రూ.20,300 కోట్ల నిధులను తరలించుకుపోయారు.
- కార్పొరేట్ల ఆశాజనక ఆర్థిక ఫలితాలకు తోడు అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను యథాతథంగా ఉంచుతూ తీసుకున్న నిర్ణయం దేశీయ సూచీలకు దన్నుగా నిలిచాయి.

**- సిద్ధార్థ ఖేంకా, మోతీలాల్ ఓశ్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రిటైల్ హెడ్**

## ఎన్ఆర్ఏఐ హైదరాబాద్ చాప్టర్ హెడ్‌గా సంపత్ తుమ్మల

హైదరాబాద్, అక్టోబర్ 30: జాతీయ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఎన్ఆర్ఏఐ) హైదరాబాద్ చాప్టర్ హెడ్‌గా సంపత్ తుమ్మల నియమితులయ్యారు. హైదరాబాద్ చాప్టర్ హెడ్‌గా పనిచేసిన శంకర్ కృష్ణమూర్తి, కవిత మంతలను నేషనల్ మేనేజింగ్ కమిటీలో తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎఫ్‌అండ్‌బీ రంగానికి ఇండస్ట్రీ హోదా ఇవ్వాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఈ అసోసియేషన్ ఆధ్వర్యంలో త్వరలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు